
వరదనీటి కాలువ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

ఐఎస్ సదన్‌లో రూ.20 కోట్లతో అభివృద్ధి: శ్వేతారెడ్డి

సైదాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐఎస్ సదన్ డివిజన్‌లో ఈ యేడు సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. గురువారం కృష్ణానగర్‌లో రూ.4కోట్ల వ్యయంతో చేపట్టనున్న వరదనీటి కాలువ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు తోట అమర్నాథ్ రెడ్డి, మధుకర్ రెడ్డి, మన్నె శ్రీనివాస్, రేణుక ముదిరాజ్, గిరిధర్ రెడ్డి, బొమ్మ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముసారాంబాగ్‌లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు


చార్మినార్ జడ్‌సీకి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

చాదర్‌ఘాట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.2కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూపొందించిన ప్రతిపాదనలకు త్వరగా నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి రెడ్డి గురువారం జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్ వెంట బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



సైదాబాద్ డివిజన్‌లో రూ.2కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

- సైదాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి)

శ్మశానవాటికను మరో ప్రాంతానికి తరలించండి


మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానించిన రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సభ్యులు

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాక్‌టౌన్ కాలనీలో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న శ్మశానవాటికను మరో ప్రాంతానికి తరలించాలని ఆ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కాలనీ సభ్యులతో కలిసి తెలంగాణ రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ రాక్‌టౌన్ కాలనీలో ప్రధానరోడ్డు పక్కన శ్మశానవాటికను గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా ఏర్పాటు చేశారన్నారు. 6వేల మందికిపైగా కాలనీ జనాభా, సుమారు 1100మంది విద్యార్థులు ఉండే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సమీపంలో ఈ శ్మశానవాటిక ఉండటంతో అందరికీ చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అదేవిధంగా రాక్‌టౌన్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాలనీ నూతన కార్యవర్గ సభ్యులను రాంరెడ్డి శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాక్‌టౌన్ కాలనీ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి మణిపాల్‌రెడ్డి, సభ్యుడు సంజీవరెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తపోవన్ కాలనీ వాసులు

తపోవన్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

ఎల్బీనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ డివిజన్ తపోవన్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు రావులకొల్లు ప్రకాష్ కోరారు. నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిని వార్డుకార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రావులకొల్లు ప్రకాష్ మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఎస్వీఆర్ స్కూల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగించాలని, దుర్గాదేవి ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించిన కార్పొరేటర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధానకార్యదర్శి కుప్పాడపు మధు, కోశాధికారి రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షులు రాజుచారి, సుధాకర్, సభ్యులు ప్రకాష్, సాయికిరణ్, ఐలయ్యాదవ్, నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌రావు, ఇంద్రసేన ప్రసాద్, హరి, సిద్ధు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయుడి జయంతి


దత్తాత్రేయుడి జయంతి వేడుకలో శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ స్వామి జయంతి మహోత్సవాలు నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొని దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్టు చైర్మన్ కొలను వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ వేడుకల్లో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గునగంటి రాములుగౌడ్, ప్రధానకార్యదర్శి కొర్వి జంగయ్యగుప్తా, కోశాధికారి రావుల రంజిత్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

'కేఎన్ఆర్'కు శుభాకాంక్షల వెల్లువ



శుక్రవారం మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆయనను నివాసంలో కలిసి జ్ఞాపిక అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేవైఎం ఎల్బీనగర్ కో-కన్వీనర్ పొట్లంపల్లి సాయిరాంగౌడ్, నాయకులు భీమనపల్లి సిద్ధు, పారంద సాయి, చంద్రశేఖర్, బందెల సైదులు, ముఖర్జీ, రమేష్ తదితరులు

- మన్సూరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి)

బడంగ్‌పేట్‌ను ప్రత్యేక జోన్ చేయాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్

సరూర్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో విలీనం చేయడం సరికాదని, విస్తీర్ణంపరంగా, వార్షికాదాయంపరంగా పెద్దదైన బడంగ్‌పేట్‌నే ప్రత్యేక జోన్‌గా ఏర్పాటు చేసి పరిసర మునిసిపాలిటీలను ఇందులో విలీనం చేయాలని బీఎస్పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, బడంగ్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ గ్రేటర్‌లో విలీనం నేపథ్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో కలపడాన్ని నిరసిస్తూ గురువారం బాలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖర్ మాట్లాడారు. ప్రస్తుతం ఎల్బీనగర్ జోన్‌లో కలిపిన తుక్కుగూడను కూడా బడంగ్‌పేట్‌లో కలపాలని సూచించారు. ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయంపై బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

మజ్లిస్ మెప్పు కోసమే చార్మినార్ జోన్‌లోకి బడంగ్‌పేట్: అందెల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత శ్రీరాములు యాదవ్

మజ్లిస్ పార్టీ నేతల మెప్పు కోసమే బడంగ్‌పేట్ ప్రాంతాన్ని పాత నగరంలోని చార్మినార్ జోన్‌లో విలీనం చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. విలీనం నిర్ణయంపై గురువారం నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాములుయాదవ్ మాట్లాడారు. నార్త్ వైపు ఉన్న బడంగ్‌పేట్‌తో పాటు ఆదిభట్ల, తుర్కయాంజాల్ మునిసిపాలిటీలను సౌత్ జోన్ (చార్మినార్ జోన్)లో కలపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి ఈ విషయంపై వెంటనే స్పందించి ప్రభుత్వంతో కొట్లాడి చార్మినార్ జోన్‌లో బడంగ్‌పేట్ విలీనం కాకుండా చూడాలని ఆయన సూచించారు.


బడంగ్‌పేట్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి

'స్థానిక' పాలనను ప్రజలకు దూరం చేస్తున్న ప్రభుత్వం: బీఆర్ఎస్

స్థానిక పాలనను ప్రజలకు దూరం చేస్తూ వారిపై పన్నుల భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీఆర్ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ నేతలు ఆరోపించారు. గ్రేటర్‌లో విలీనం నిర్ణయానికి వ్యతిరేకంగా గురువారం బడంగ్‌పేట్‌లో పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. దాదాపు 70శాతం గ్రామీణ ప్రాంతాన్ని కలిగి ఉన్న బడంగ్‌పేట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం సరికాదని అన్నారు. పైగా తమ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో కలపాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎక్కడో ఉన్న తుక్కుగూడను ఎల్బీనగర్ జోన్‌లో కలిపి, తమ కార్పొరేషన్‌ను చార్మినార్‌లో కలపడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి తదతరులు పాల్గొన్నారు.


గ్రేటర్ కమిషనర్‌కు అందజేసిన వినతి పత్రాన్ని చూపుతున్న రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి

బడంగ్‌పేట్‌ను చార్మినార్ జోన్‌లో కలపొద్దు

గ్రేటర్ కమిషనర్‌కు బీజేపీ వినతి

సరూర్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను గ్రేటర్‌లోని చార్మినార్ జోన్‌లో కలపాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, పక్కనే ఉన్న ఎల్బీనగర్ జోన్‌లో కలపాలని కార్పొరేషన్ బీజేపీ నాయకులు గ్రేటర్ అధికారులను కోరారు. ఈ మేరకు బడంగ్‌పేట్ బీజేపీ క్లస్టర్-1,2 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి గురువారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో గ్రేటర్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడంగ్‌పేట్‌కు ఎల్బీనగర్ జోన్ దగ్గరగా ఉంటుందని, చార్మినార్ జోన్ దూరంగా ఉండడమే కాకుండా అక్కడికి వెళ్లాలంటే ట్రాఫిక్ చిక్కులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా తమ కార్పొరేషన్‌ను చార్మినార్ నుంచి తొలగించి ఎల్బీనగర్ జోన్‌లో కలపాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్‌గౌడ్, మురళీధర్‌రెడ్డి, దేశపాక జగన్ పాల్గొన్నారు.



మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయానికి గ్రేటర్ బ్యానర్ ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు

కార్పొరేషన్ల రికార్డులు 'గ్రేటర్' వశం

సరూర్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లను గ్రేటర్‌లో విలీనం చేసి, తాజాగా చార్మినార్ జోన్ కిందకు తీసుకువచ్చిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు గురువారం మరోమారు ఆయా కార్పొరేషన్లకు చేరుకుని పూర్తి స్థాయిలో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత సిబ్బంది, నిధుల లభ్యత, ఆదాయ వనరులు, ఖర్చులు, సిబ్బంది వేతనాలు, సొంత వాహనాలు, జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు, చెల్లించాల్సిన బిల్లులు తదితర వివరాలను జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌కు అనుసంధానం చేసి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేశారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ అధికారులు ఆయా వివరాలను వారికి అందజేశారు. కాగా, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లను చార్మినార్, ఎల్బీనగర్ జోన్లలో కలిపిన నేపథ్యంలో ఆయా కార్పొరేషన్ల వద్ద కొత్త బోర్డులు(తాత్కాలికంగా బ్యానర్లు) ఏర్పాటు చేశారు. వాటిపై హైదరాబాద్ మహానగర పాలక సంస్థ- మీర్‌పేట్ సర్కిల్, బడంగ్‌పేట్ సర్కిల్ అని పేర్కొన్నారు.

రెండో రోజూ పెద్దఅంబర్‌పేట్‌లో రికార్డులు స్వాధీనం



మున్సిపల్ కార్యాలయానికి పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్‌లో నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీని ప్రభుత్వం విలీనం చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి చెందిన రికార్డులను బుధవారం అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి స్వాధీనం చేసుకున్నారు. కాగా, గురువారం ఉదయం కూడా జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అధికారులు మరోసారి పెద్దఅంబర్‌పేట్ కార్యాలయానికి వచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లోని ప్రొఫార్మాలో పేర్కొన్న విధంగా మున్సిపాలిటీకి చెందిన సమగ్ర సమాచారాన్ని సేకరించారు. 1 టూ 9 ఫార్మాట్‌లో విధంగా మున్సిపాలిటీలోని అన్ని సెక్షన్లలోని వివరాలను అధికారులు సేకరించారు. 2001-2011 జనాభా లెక్కలు, మురికి వాడలు, ఉద్యోగుల వివరాలు, సివిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వివరాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వివరాలు, భవనాలు, ఓపెన్ ల్యాండ్స్, పార్కులు, వాహనాల వివరాలు, డిపాజిట్స్ ఇన్‌వెస్ట్‌మెంట్స్, ఎఫ్‌డీఆర్‌ఎస్‌ల వివరాలు, ప్రభుత్వ పథకాల వివరాలు, అభివృద్ధి పనులు, గత మూడు సంవత్సరాల్లో భవనాల, లేఅవుట్ అనుమతుల వివరాలను సేకరించారు. కార్యాలయానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సర్కిల్ పరిధిలోని అన్ని బోర్డులను మార్చనున్నట్లు డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ

రెండో రోజు సర్పంచ్‌లకు 28, వార్డులకు 185 నామినేషన్లు దాఖలు


గుంతపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేస్తున్న కరిమెల వరలక్ష్మీ వెంకటేష్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో శుక్రవారంతో మూడో విడత నామినేషన్ల స్వీకరణకు గడువు ముగియనుంది. గురువారం రెండో రోజు పలు గ్రామాల నుంచి సర్పంచ్, వార్డు స్థానాలకు ఆయా పార్టీలు బలపర్చిన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. పలు గ్రామాల్లో ఆయా పార్టీలకు చెందిన 28 మంది సర్పంచ్ స్థానాలకు, 185 మంది వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారు.

రెండో రోజూ అదే తీరు

మండలంలో రెండో రోజు నామినేషన్ల పర్వం కొనసాగింది. ఉదయం నుంచే సర్పంచ్, వార్డు స్థానాలకు ఆయా పార్టీలు బలపర్చిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ దరఖాస్తును అభ్యర్థులు అసంపూర్తిగా పూరించడం వల్ల సిస్టమ్‌లో నమోదు చేస్తున్న క్రమంలో కొంత ఇబ్బంది ఏర్పడుతున్నట్లు తెలిసింది. సాయంత్రం 5గంటల్లోపు నామినేషన్ సెంటర్‌లోకి వచ్చిన వారి నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించారు. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

జనావాసాల మధ్య ఎస్టీపీ ఏర్పాటు చేయొద్దు

● పెద్దఅంబర్‌పేట్‌లో కాలనీ వాసుల దీక్ష


నిర్మాణంలో ఉన్న ఎస్టీపీ ఎదురుగా దీక్ష చేస్తున్న కాలనీవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్యలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) ఏర్పాటు చేయొద్దని పోలీస్‌కాలనీ, అంబికానగర్, దయాకర్‌రెడ్డి కాలనీవాసులు డిమాండ్ చేశారు. పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 292 ఎఫ్‌టీఎల్‌లో ఎస్టీపీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్లాంట్ నిర్మాణానికి ఎదురుగా టెంట్ వేసుకుని సమీప కాలనీవాసులు, ఆల్ పార్టీ నాయకులు గురువారం దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, ఆల్‌పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎస్టీపీల ఏర్పాటును అడ్డుకున్న వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెంటనే స్పందించాలని లేనీ పక్షంలో పెద్దఅంబర్‌పేట్ గ్రామస్థులమంతా ఇక్కడ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వెంటనే నిర్మాణ పనులను ఆపివేసి మరో చోట ఏర్పాటు చేయాలని సూచించారు. అప్పటి వరకు ఇక్కడ దీక్షలు కొనసాగుతాయని కాలనీ వాసులు, నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధంకి కృష్ణారెడ్డి, పండుగుల రాజు, దండెం రాజశేఖర్‌రెడ్డి, దండెం రాంరెడ్డి, అయ్యప్పరెడ్డి, ప్రశాంత్‌రెడ్డితో పాటు కాలనీల మహిళలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడికి మంత్రి పరామర్శ

● లక్ష రూపాయల చెక్కు అందజేసిన అడ్లూరి

● బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ మన్సురాబాద్ సమీపంలోని శివగంగా కాలనీలో ప్రేమ్‌చంద్ అనే బాలుడిపై కుక్కలు దాడి చేసిన ఘటనపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం.. నీలోఫర్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాలుడిని మంత్రి అడ్లూరి పరామర్శించారు. వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అత్యవసర సాయం కింద బాలుడి తల్లిదండ్రులకు మంత్రి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తనకు ఫోన్ చేసి సత్వరమే ఆ బాలుడికి వైద్య సదుపాయం, ఆర్థిక సహాయంతో పాటు కుటుంబానికి అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారని తెలిపారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, బాలుడికి స్పెషల్ స్కూల్‌లో అడ్మిషన్ ఇప్పిస్తామని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు ఆ బాలుడికి దివ్యాంగుల గుర్తింపు కార్డు తక్షణమే జారీ చేశారు. దివ్యాంగ పింఛను మంజూరు, సంరక్షణకు కావలసిన సదుపాయాలు, వైద్య చికిత్స, పునరావాస సహాయ అందించడం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

పరామర్శించిన మేయర్, డిప్యూటీ మేయర్

కుక్కకాటుకు గురైన బాలుడికి అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. గురువారం వారు అధికారులతో కలిసి నిలోఫర్ ఆస్పత్రిలో బాధిత బాలుడిని పరామర్శించారు.


తుర్కయంజాల్ సర్కిల్ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీలు మంగతాయారు, సత్యనారాయణరెడ్డి


పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు

రోశయ్యకు ఘన నివాళి

హయత్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్, పెద్దఅంబర్‌పేట్ సర్కిల్ కార్యాలయాల్లో గురువారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్‌లో రోశయ్య చిత్ర పటానికి సర్కిల్ ప్రత్యేక అధికారి, డిప్యూటీ కమిషనర్లు మంగతాయారు, సత్యనారాయణరెడ్డి, పెద్దఅంబర్‌పేట్‌లో డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రానికి రోషయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఈఈ బిక్షపతి, మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతిభకనబర్చిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

మన్సూరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మానసిక వికాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నారాయణ స్కూల్స్ తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నారాయణ స్కూల్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు గురువారం 'ఈ చాంప్స్ స్పోర్ట్స్ మీట్‌'ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని, ఇవి మానసిక ధైర్యంతో పాటు క్రీడా స్ఫూర్తినిస్తాయని అన్నారు. అనంతరం ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ స్కూల్ ఏజీఎం హేమేందర్, ఆర్ఐ రవిప్రసాద్, ఆర్‌డీ మహేశ్వరి, సమన్వయకర్త గాయత్రి, నారాయణ స్కూల్స్ తెలంగాణ స్పోర్ట్స్ హెడ్ సురేష్, ప్రిన్సిపాల్స్ లక్ష్మీశారద, అనిల్, వైస్‌ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఏఓలు రాజేష్, కరుణాకర్, పీఈటీలు శివ, సరిత తదితరులు ఉన్నారు.

మంత్రి అజారుద్దీన్‌ను కలిసిన బోయపల్లి



మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌ను గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ లోని అల్మాస్‌గూడకు చెందిన ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

- సరూర్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి)

సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు


సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్

సైదాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నేతలపై కేసులు నమోదు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం చట్టరీత్యా నేరమని, బాధ్యులైన బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బాబు శ్రీనివాస్, కృష్ణ, అస్రఫ్ హుస్సేన్, కృష్ణ కుమార్, లడ్డూ పటేల్ పాల్గొన్నారు.


మహాపడిపూజలో అయ్యప్పను దర్శించుకున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురంలో ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ఎల్బీనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం మహిళా విభాగం కార్యనిర్వాహక అధ్యక్షురాలు పటేల్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ హరిపురికాలనీలోని ఆమె నివాసంలో నిర్వహించిన ఈ వేడుకలో ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి హరిహరసుతుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు, అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద (భిక్ష) వితరణ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, నిఖిల్ రెడ్డి, శివాని, బీఆర్ఎస్ నాయకులు గొడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, శ్యాంగుప్తా, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, సిద్దగోని వెంకటేష్, మల్లేష్ ముదిరాజ్, జయమ్మ, లత, నిర్మల, నిమ్మల సునీతారెడ్డి, చామల శ్యామలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.